క్లుప్తంగా

రహదారిపై గుంతల పూడ్చివేత



రోడ్డుకు మరమ్మతు చేస్తున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

తాంసి: జిల్లా కేంద్రం నుంచి తాంసి, తలమడుగు మండలాల్లోని ఆయా గ్రామాల మీదుగా వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి గుంతలుగా మారింది. ఈరోడ్డుపై ప్రయాణికులు వాహనాలకు నడపేందుకు అవస్థలు పడుతున్నారు. అంతర్రాష్ట్ర రోడ్డు దుస్థితిపై ఈనెల 16న సాక్షి దినపత్రికలో 'నరక ప్రయాణం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. గుంతలుగా మారిన రోడ్డు పరిశీలించి, పూడ్చివేయించారు.

చేతిపంపునకు మరమ్మతులు



నీటి సరఫరాను పునరుద్ధరిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నార్నూర్: గాదిగూడ మండలంలోని కొటాల గ్రామంలో చేతిపంపునకు మోటార్ బిగించి నీటి సరఫరాను అందించారు. ఎంపీవో రమేశ్, పంచాయతీ కార్యదర్శి సాయిసాగర్ గ్రామాన్ని సందర్శించారు. బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను అడిగి తెలుసుకొని చర్యలు చేపట్టారు. గ్రామానికి నీటి సరఫరా కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ప్రజావేదిక

బేల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పథకం పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదిక ఉంటుందని ఎంపీడీవో శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి పనుల్లో జరిగిన అభివృద్ధి, లోటుపాట్లపై ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలస్థాయి ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శులు, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌లు, కూలీలు హాజరు కావాలని ఆయన కోరారు.

పోషకుల సమావేశం విజయవంతం చేయండి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 26న నిర్వహించే పోషకుల సమావేశాన్ని విజయవంతం చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మీ పిల్లల విద్యా ప్రగతిని సమీక్షించేందుకు వారి బలాలు, బలహీనతలపై అధ్యాపకులతో చర్చించేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు హాజరు కావాలన్నారు.

బేల ఎంపీడీవోగా శ్రీనివాస్

బేల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన మహేందర్‌కుమార్ స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా గాదిగూడ మండలానికి బదిలీ అయ్యారు. ఇక్కడికి బదిలీపై వచ్చి ఎంపీడీవోగా శ్రీనివాస్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సూపరింటెండెంట్ జమీల్ అహమ్మద్, సీనియర్ అసిస్టెంట్‌లు గిరి, గంగాదేవీలు కలిసి శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఇంద్రవెల్లి: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ముత్నూర్ సెక్టార్ సూపర్‌వైజర్ రేవతి అన్నారు. పోషణ మాసంలో భాగంగా బుధవారం మండలంలోని గిన్నేర గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అందుబాటులో ఉన్న పండ్లు, కూరగాయలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బొప్పాపూర్, గిన్నెర, మర్కగూడ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ర్యాలీ విజయవంతం చేయండి

తలమడుగు: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని నిరసిస్తూ.. నిర్వహించే ర్యాలీని ఆదివాసీలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘ నాయకులు జ్ఞానేశ్వర్ అన్నారు. బుధవారం మండలంలోని పునగూడ గ్రామంలో సమావేశం నిర్వహించారు. డోర్లీ గ్రామం నుంచి తలమడుగు తాహసీల్దార్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని గ్రామాల ఆదివాసీలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జంగాల పోచ్చన్న, భుజంగ్‌రావు, ఛత్రపతి, జ్యోతిరామ్, భీమ్‌రావు, మాధవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దిగుబడిపై దిగులు..!

- పెట్టుబడులు కూడా రాని పరిస్థితి
- ఆందోళనలో సోయా రైతులు
- నియోజకవర్గంలో 38వేల ఎకరాల్లో సాగు



కచికంటిలో సాగవుతున్న సోయాబీన్ పంట

ఆదిలాబాద్‌రూరల్: వర్షాలు అనుకూలంగా కురిస్తే ఈ పాటికి సోయాబీన్ కోతకు వచ్చేంది. కానీ ఈ ఏడాది వర్షాలు ఏకధాటిగా కురవడంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో రైతులు పంటకు సకాలంలో ముందులు పిచికారీ చేయకపోవడం, ఎరువులు వేయకపోవడం, కొంత మంది రైతులు ఎరువులు వేసిన్నప్పటికీ వర్షపు నీటికి కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ కారణంగా దిగుబడులపై ప్రభావం పడి కనీసం పెట్టుబడులు కూడా రాలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వర్షాల ప్రభావం..

ఆదిలాబాద్ నియోజకర్గంలో ఆరు మండలాలు ఉండగా.. ఈ వానాకాలం ఆదిలాబాద్ రూరల్ మండలంలో 17 వేల ఎకరాలు సోయాబీన్, జైనథ్ మండలంలో 17 వేలు, బేలలో 6 వేలు, సాత్నాలలో 435 ఎకరాలు, భోరజ్‌లో 3 వేలు, మావలలో 200 ఎకరాలు సోయాబీన్ సాగు చేస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఆయా మండలాల్లో మొత్తం 38,655 ఎకరాలలో సోయాబీన్ సాగు కాగా 1,12,227 ఎకరాలలో పత్తి సాగవుతోంది. అయితే సోయబీన్ వేసిన 90 రోజుల నుంచి 100 రోజుల కాల వ్యవధిలో కోతకు వస్తోంది. అనంతరం రబీలో శనగ, గోధుమ, వేరు శనగ, తదితర పంటలు సాగు చేసే వారు. కానీ వర్షాల ప్రభావంతో ఇప్పటికీ సోయాబీన్ కోతకు రాలేదు. మరో వారం, పది రోజులు ఆలస్యమయ్యే పరిస్థితి ఉంది.

ఈ ఏడాది నష్టాలే..

వర్షాలు అనుకూలంగా కురిస్తే సోయాబీన్ ఆగస్టు చివరి వారంలో, సెప్టెంబర్ మొదటి వారంలో కోసే వారు. భారీ వర్షాలతో కోత జాప్యం జరుగుతోంది. ఇదిలా ఉండగా ప్రతీ ఏడాది ఎకరానికి సుమారు 8 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల సోయాబీన్ దిగుబడి వచ్చేది. కానీ ఈ ఏడాది మాత్రం ఎకరానికి 5 క్వింటాళ్ల నుంచి 6 క్వింటాళ్లలోపు దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పత్తి దిగుబడిపై సైతం ప్రభావం పడిందని రైతులు పేర్కొంటున్నారు.

కోత ఆలస్యం

వర్షాలు ఏకధాటిగా భారీ కురవడంతో సోయాబీన్ కోత ఆలస్యమవుతుంది. ప్రతీ ఏడాది వానాకాలంలో సాగు చేసే సోయాబీన్ పంట ఈలోగా కోత పూర్తయ్యేది. కానీ ఈ ఏడాది ఆలస్యమవుతుంది. అంతేకాకుండా దిగుబడిపై ప్రభావం చూపుతోంది. సోయాబీన్ పంట కోతకు మరో వారం, పది రోజుల సమయం పట్టే అవకాశం ఉంది.

– నగేశ్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి ఆదిలాబాద్

పూలసాగుతో ఉపాధి

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(బి) గ్రామానికి చెందిన జాదవ్ మాహదు వివిధ రకాల పూలు సాగు చేస్తూ.. ఉపాధి పొందుతున్నాడు. గత నాలుగు సంవత్సరాల నుంచి రెండు ఎకరాల్లో పూలు సాగు చేస్తూ.. లాభాలు అర్జిస్తున్నాడు. బతుకమ్మ, దసరా, దీపావళి సమయంలో పంట చేతికివచ్చే బంతి పూలు, చామంతి రకం ఎంపిక చేసుకొని సాగు చేస్తున్నాడు. ప్రతీ ఏటా మహారాష్ట్రలోని పూనే జిల్లా నుంచి పూల మొక్కలను దిగుమతి చేసుకొని నాటుతున్నాడు. మొక్కలకు బిందుసేద్యం ద్వారా నీటిని, ఎరువులను అందిస్తున్నాడు. పెళ్లిల సీజనల్ సైతం పూలు విక్రయిస్తున్నాడు. ఇచ్చోడ, నిర్మల్, ఆదిలాబాద్ పట్టణలలో ఉండే పూల వ్యాపారులకు ఆర్డర్‌పై సరఫరా చేస్తుంటాడు.



అడేగామ(బి)లో సాగు చేస్తున్న పూలు

30 వేల మొక్కలు



ఈఏడాది రెండు ఎకరాల్లో సాగు చేసేందుకు పూణే నుంచి రూ. 30 వేల విలువ గల మొక్కలను తీసుకువచ్చాను. వర్షాలకు కొన్ని మొక్కలు సచ్చిపోయాయి. పూల మొక్కలను చిన్ని పిల్లలాగా కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఎరువులు, ఇతర ఖర్చులు పోను ప్రతీ ఏటా సీజన్‌లో రూ. 1 లక్ష వరుకు సంపాదిస్తా. – మాహదు, రైతు

కళాశాలలో బతుకమ్మ సంబురాలు

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాతీయ సేవ దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టెలా విద్యార్థినులు బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కాంబ్లే బాలాజీ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

సామాజిక సేవలో ముందుండాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రఘు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు సామాజిక సేవలో ముందుండాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఘు అన్నారు. బుధవారం కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువుతో పాటు సేవా దృక్పథంతో మెలగాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు చంద్రకాంత్, స్వామి, అసద్, నరేశ్ పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని వాగ్దేవి జూనియర్, డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని, గ్రామాల్లోకి వెళ్లి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే దిశగా విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అధ్యాపకులు ప్రవీణ్ రెడ్డి, ముత్యం సతీష్, కార్తీక్, దీప పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక సేవ దృక్పథం ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇటీవల గ్రామాల్లో చేపట్టిన సేవా కార్యక్రమాల్లో పది మంది విద్యార్థులకు మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జ్ఞానేశ్వర్, అధ్యాపకులు అశోక్‌రెడ్డి, భీమేష్, ప్రదీప్, హైమద్, వనజ, గంగాధర్, సుభాష్, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

నేరడిగొండ: విద్యార్థులకు సేవా దృక్పథం ఉండాలని తెలుగు లెక్చరర్ నాగోరావ్ అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చేరాల లక్ష్మణ్ ఎన్ఎస్ఎస్ ఆవిర్భావం, దాని లక్ష్యాలు గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అధ్యాపకులు శ్రీనివాస్ వినోద్ దత్తు, సువర్ణ, శ్రీలత, గణేష్, సుజాత, అశ్విన్ పాల్గొన్నారు

తరగతుల నిర్వహణపై చర్యలు తీసుకోవాలి

బేల: దసరా సెలవుల్లో ప్రైవేటు పాఠశాలల తరగతుల నిర్వహణపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ శివనిత్‌వార్ ఓం ప్రకాష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించడం సరికాదన్నారు. బేల మండలంలోని ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించకుండా పదో తరగతి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు మాడవార్ హరీశ్‌రెడ్డి, మనోజ్, తరుణ్, కన్నె సాయి, పొల్కట్ బాలాజీ, ఉదయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓం ప్రకాష్

సామాజిక రుగ్మతలపై అవగాహన

తాంసి: మండలంలోని కప్పర్ల, జామిడి, తాంసి, బండల్‌నాగాపూర్ గ్రామాల్లో బుధవారం సామాజిక రుగ్మతలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి మహిళ సాధికారతలో భాగంగా పలు విషయాలను వివరించారు. మహిళా సాధికారత అధికారి కృష్ణవేణి మాట్లాడుతూ.. పేదరికం, బాల్య వివాహాలు, లింగ సమానత్వం, వరకట్నం, స్త్రీలపై హింస, మూఢ నమ్మకాలను వీడనాడాలని సూచించారు. కార్యక్రమంలో మహిళ సాధికారత బృందం సభ్యులు కోటేశ్వర్, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, గంగమ్మ, మంగళ, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

నేరడిగొండ: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం అన్నపూర్ణ దేవీ రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లో భక్తులు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు.

దుర్గాదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: మండలంలోని బుద్దికొండ గ్రామంలో దుర్గాదేవిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను భవానిమాత భక్తులు శాలువాతో సత్కరించారు. మండపం వద్ద బోర్ వేయించాలని భక్తులు ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా బోర్ వేయిస్తానని హామీ ఇచ్చారు.

మహిళలతో నృత్యం..

బోథ్: సొనాల మండలంలోని సూర్యనగర్ గ్రామంలోని పోచమ్మ ఆలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక మహిళలతో కలిసి నృత్యం చేశారు. పోచమ్మ ఆలయానికి రూ. రూ. 30ల విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను మహిళలు శాలువాతో సత్కరించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, తుల శ్రీనివాస్, స్వామి, శ్రీధర్ రెడ్డి, సదానంద్, సురేందర్ యాదవ్, దివాకర్ రెడ్డి, అభిలాష్ పాల్గొన్నారు.

'చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి'

భీంపూర్: యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని ఎస్సై భూపాలపల్లి విక్రమ్ సూచించారు. మండలంలోని గుబిడి గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. నూతనంగా ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఆయనను గ్రామస్తులు ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామస్తులతో కలిసి పెన్‌గంగ నది పరీవాహక ప్రాంతాన్ని సందర్శించారు.

మద్యపానం నిషేధించాలి

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామంలో మద్యపానం నిషేధించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఇచ్చోడలోని ఎక్సైజ్ కార్యాలయంలో గ్రామస్తులతో కలసి ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నానం రమణ, నవీన్, చంద్రశేఖర్, బొడ్డు భోజరెడ్డి, విజయ్, కొడారి నరేశ్, మడ్గె అశోక్, రాజేశ్వర్, నందీశ్వర్ పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

బేల: మండలంలోని బేల, డోప్టాల సహకార సంఘాల కార్యాలయాల్లో 15 మెట్రిక్ టన్నులు, బేలలోని మన గ్రోమోర్ కేంద్రంలో 22 మెట్రిక్ టన్నులు, పోనాల గ్రామంలోని శివ్ బేల ఎఫ్‌పీసీ కేంద్రంలో 10 మెట్రిక్ టన్నులు యూరియాను బుధవారం పంపిణీ చేశారు. పంపిణీని మండల వ్యవసాయ అధికారి సాయితేజరెడ్డి పరిశీలించారు. క్యూలైన్‌లో ఉన్న ప్రతీ రైతుకు ఒక్కొక్క పట్టాపాస్ బుక్‌కు రెండేసి చొప్పున యూరియా బ్యాగులు పంపిణీ చేశామని తెలిపారు.

27న కేళాపూర్‌కు పాదయాత్ర

ఆదిలాబాద్‌టౌన్: జగదంబ భక్త మండలి ఆధ్వర్యంలో ఈనెల 27న సాయంత్రం కేళాపూర్‌కు పాదయాత్ర నిర్వహించనున్నట్లు మండలి సభ్యులు సంజయ్ జోషి తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డిని కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. గత 30 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక యాత్రను జిల్లా కేంద్రంలోని రాణిసతిజీ దేవాలయం నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జగదంబ భక్త మండలి సభ్యులు నరేందర్ డోక్వల్, దారంపాల శర్మ, ముకేష్ శర్మ, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి పాల్గొన్నారు.

'కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..'



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది

కైలాస్‌నగర్: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణంలోని 18 ,19 వార్డుల బీఆర్ఎస్ అధ్యక్షుడు లంక కార్తీక్ ఎండి.మతీన్‌తో పాటు 15వ వార్డు బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు బబిత, రణదీవేనగర్, గాంధీనగర్‌ల పలువురు కాలనీవాసులు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే దూదేకుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ఇస్మాయిల్, షేక్ రఫీక్ తమ కార్యవర్గంతో కలిసి పార్టీలో చేరారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం..

రాష్ట్ర ప్రభుత్వం దూదేకుల సామాజిక వర్గానికి లక్ష రూపాయల వడ్డీ లేని రుణంతో పాటు స్కూటీ ఇస్తామని ప్రకటించడంపై కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

సంక్షిప్తం..

రోడ్డుకు మరమ్మతు

బోథ్: సొనాల మండలంలోని చింతల్ బోరి గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దగూడ గ్రామానికి వెళ్లే దారి బురదమయంగా మారడంతో యువకులు రోడ్డుపై మొరం పోయించి మరమ్మతులు చేశారు. కార్యక్రమంలో యువసైన్యం సభ్యులు గిత్తే విజయ్ కుమార్, కాగ్నె రవికాంత్, ముండే ఈశ్వర్, కేంద్రే ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

బోథ్: సొనాల మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న గుంతలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు, జేసీబీ యజమానులు ముందుకు వచ్చి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. గుంతల్లో మొరం పోయించి పూడ్చారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన రూపేష్ రెడ్డి

కైలాస్‌నగర్: యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి బుధవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిసి శాలువాతో సత్కరించారు. అదిలాబాద్ నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

విద్యార్థికి సన్మానం

నేరడిగొండ: మండలంలోని బొందిడి గ్రామానికి చెందిన రాథోడ్ ప్రకాష్ కుమారుడు అరుణ్‌కుమార్ ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో రాథోడ్ రమేశ్, సుభాష్, దేవేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, సంధ్యారాణి పాల్గొన్నారు.

స్వచ్ఛత పాటించాలి

ఇంద్రవెల్లి: ప్రతిఒక్కరూ స్వచ్ఛత పాటించాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ స్వప్నిల్ అన్నారు. బుధవారం బ్యాంక్ సమీపంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంక్ సిబ్బంది అమోల్, నవనీత్, సుశీల్ జాదవ్, విజయ్, శేషు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ కార్యదర్శిని కలిసిన ప్రభాకర్‌రెడ్డి

కైలాస్‌నగర్: సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజాను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పంజాబ్‌లోని చండిఘడ్‌లో జరుగుతున్న జాతీయ మహాసభలకు హాజరై ఆయనను కలిశారు. జిల్లాలోని సమస్యలు, పార్టీ చేస్తున్న పోరాటాలు, సమస్యల గురించి తెలిపారు.


మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



యూరియా పంపిణీని పరిశీలిస్తున్న ఏవో కృష్ణవేణి

నేరడిగొండ: మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని ఏవో కృష్ణవేణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో యూరియా పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతీ రైతుకు సకాలంలో యూరియా అందేలా చూడాలన్నారు., ఎరువులు అధికంగా వాడడం వలన భూసారం దెబ్బతింటుందన్నారు. వ్యవసాయ అధికారుల సిఫార్సుల మేరకు ఎరువులను వాడాలని సూచించారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకే మందులను పిచికారీ చేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయం చేయాలన్నారు. ఆమె వెంట వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శ్యాం సుందర్, సౌజన్య, సీఈవో నాగభూషణ్, తదితరులు ఉన్నారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

భీంపూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామాల్లో అందిచే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ అన్నారు. భీంపూర్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య విస్తరణాధికారి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.